# ఆచార్యులకు అక్షర నీరాజనం

## ఆచార్య శర్మగారికి అరవై సంవత్సరాలా?

మాస్టారు - ప్రొఫెసర్ నాగభూషణ శర్మగారికి అరవై సంవత్సరాలు నిండాయా? పదవీ విరమణ తరువాత ఆయనేం చేస్తారు? అమెరికా వెళ్ళి ఏ విశ్వవిద్యాలయంలోనో ఆచార్యత్వం స్వీకరిస్తారా? లేకపోతే ఇక్కడే ఉండి ఆయనకు అతి ఇష్టమైన రిపర్టరీ పెడతారా?'' ఇలాంటి ప్రశ్నల్ని వేలాదిమంది విద్యార్థులు, ఇంకా అనేక వేలమంది నాట్యమిత్రులు అడగడం ప్రారంభించారు. మాస్టారుగారికి షష్టిపూర్తి అభినందన జరుగుతున్నదని తెలిసి, ''అసలు ఆయన రిటైర్ కావడమేమిటి? అధికార పూర్వకంగా ఓ యూనివర్సిటీలో పనిచెయ్యరు. అంతే! కాని అసలు ఆయన చేయవలసిన పని ఇంకా ముందు ముందే ఉంది.'' అంటారు ఆయన అభిమానులు. ఆయనకు ఇష్టమైన పనులు ఆయన స్వేచ్ఛగా చేయవలసిన అదను, అలానే తెలుగు నాటకరంగ సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేపట్టిన ప్రణాళికలను అమలుపరచడం ఆయన స్వీకరించాలనుకొనే కార్యక్రమాలు.

అయితే శ్రీ శర్మగారికి, తెలుగు నాటకరంగానికి ఉన్న అవినాభావ సంబంధం ఏమిటి? ఆయన ఈ రంగానికి ఎలా వచ్చారు? వచ్చి ఏం చేశారు?

నాగభూషణ శర్మగారి స్వగ్రామం గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకా, ధూళిపూడి అనే గ్రామం. తండ్రిగారు స్వర్గీయ మొదలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ గారు. నలభై సంవత్సరాలు ఆ ఊరి హైస్కూలుకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన సాహితీవేత్త. నాటకరచయిత. ''నాలోని రంగస్థల పిపాసకు ఊపిరిపోసింది మా నాన్నగారే!'' అని సవినయంగా చెప్పుకున్నారు శర్మగారు. ఆ హైస్కూలులో సంవత్సరానికి రెండుసార్లు సాంస్కృతికోత్సవాలు జరిగేవి. ఆ స్కూలు విద్యార్థిగా ఎనిమిదో ఏట నాగభూషణశర్మగారు మొదటిసారిగా రంగువేసుకొని రంగస్థలం ఎక్కారు.

'' 'రాముని బుద్ధిమంత తనం' నేను నాటకంలో రాముడు పాత్ర నేను ధరించాను. ఆ నాటక రచయిత మానాన్న గారే! అలా నాటకరంగ ప్రవేశం చేసిన నేను, హైస్కూలు దశలోనూ, ఆ తర్వాత కాలేజి దశలోనూ విరివిగా నాటక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. విజయవాడ ఎస్. ఆర్. ఆర్. కాలేజీలో చదివేరోజుల్లో విశ్వనాథ సత్యనారాయణ గారి ప్రభావం నామీద చాలా పడింది. ఆతర్వాత బందర్ కాలేజీలో చదివే రోజుల్లో మా మాస్టారు వేదాంతం రామచంద్రరావు గారి ఆధ్వర్యంలో విపరీతంగా నాటక కార్యక్రమాలు నడిపాం. ఆయన దర్శకత్వం వహించిన 'కన్యాశుల్కం'లో నేను మధురవాణిగా నటించా. ఆ నాటకాన్ని ఆరోజుల్లో కృష్ణాజిల్లా మొత్తంమీద ఎనభైకి పైగా ప్రదర్శన లిచ్చాం. అంతేకాక నార్ల వెంకటేశ్వరరావు గారి కొత్తగడ్డ, శకునపక్షి, భంగపాటు లాంటి ప్రసిద్ధ నాటికలన్నిటిలో నటించా. ఆ తర్వాత గుడివాడ కాలేజీలో చదివేటప్పుడు, మా అధ్యాపకులు ఎర్రోజు మాధవాచార్యుల గారి ఆధ్వర్యంలో నటశిక్షణా తరగుతులు నిర్వహించ బడేవి. బసవరాజు సుబ్బారావు గారు తరగతులు నిర్వహించేవారు. ఆయన వాచికాభినయం మీద, సంభాషణలు స్పష్టంగా పలకడం మీద అభ్యాసాలు చేయించేవారు. అది నాకెంతగానో ఉపయోగపడ్డయ్'' - అన్నారు శర్మగారు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ!

సాహిత్య స్రష్ట అయిన తండ్రిగారి ప్రభావం శర్మగారి మీద బాగా పడింది. ఆ ప్రభావమే కాలేజీలో చదివేరోజుల్లో ''అన్వేషణ' అనే నాటికా రచనకు నాంది పలికింది. ''భారతి''లాంటి ప్రసిద్ధ సాహిత్య మాసపత్రికలో అది ప్రచురించబడింది. తప్పిపోయిన ఓ కుర్రాడు తల్లితండ్రులకోసం వెదకటం ఆనాటిక ఇతివృత్తం. అప్పటి నాటికలకన్న విలక్షణ మయిన రచనగా ఇది గుర్తింప బడ్డది. నటుడుగా పేరుతెచ్చుకుంటున్న శర్మగారికి రచనమీద ఆసక్తి ఎలా కలిగింది?

''నేను ఇంగ్లీసు భాషా విద్యార్థిని. ఇంగ్లీసు సాహిత్యంలో కొత్తరకంగా ఉన్న ఏ రచన తటస్థపడ్డా ఇలాటిది తెలుగులో లేదే అన్న ఆలోచన నన్ను అటువంటి రచనలకు పురిగొల్పింది. అలా చాలా నాటికలు రాశాను. అన్నీ ''భారతి''లోను, ''ఆంధ్రప్రభ''లోను ప్రచురింప బడ్డాయి. ఇవన్నీ ప్రదర్శింప బడ్డాయి కూడా. అయితే అప్పటికి నేనింకా దర్శకత్వ శాఖలోకి ప్రవేశించ లేదు. విద్యార్థిగానే నేను శలవల్లో తెలుగు ఇంగ్లీసు భాషల్లో కథలు, నవలలు, నాటకాలు, కావ్యాలు అనేకం చదివే వాడిని. అలా విపరీతంగా చదవడం వల్ల నాలో సాహితీ జిజ్ఞాస బాగా పెరిగింది.''

శర్మగారు రాసిన తొలి పూర్తి నాటకం 'విషాదాంతం'. దానికి దర్శకత్వం కూడా ఆయనే వహించారు. అంతర్ కళాశాలల నాటకపోటీలలో ఆ ప్రదర్శనకి బహుమతి కూడా వచ్చింది. తిరుపతిలో జరిగిన శ్రీ వెంకటేశ్వర నాటక కళాపరిషత్‌లో కూడా బహుమతులు పొందింది.

శర్మగారి ఎం.ఎ. చదువు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగింది. హైదరాబాద్‌లో నిర్వహించబడే ఆంధ్రాభ్యుదయ ఉత్సవాలలో **1957** సం॥లో 'జంటపక్షులు' స్వీయరచనని స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించారు. పాల్గొన్నవారంతా యూనివర్సిటీ విద్యార్థులే.

చదువు పూర్తయ్యాక శర్మగారు గుంటూరు ఎ.సి. కాలేజీలో అధ్యాపకులుగా ఉద్యోగంలో చేరారు. అయినా నాటక రచన - దర్శకత్వం మానలేదు. ఎన్నో నాటికలు-నాటకాలు, రేడియో నాటికలు రాశారు. విద్యావ్యవస్థ మీద రాసిన ''సంస్కర్తలు'', 'అడ్డదారి' నాటకాలు ఎంతో పేరు గడించాయి. అలాగే 'కల-కాపురం' అనే నాటికకు అఖిల భారత స్థాయిలో నిర్వహించబడ్డ రేడియో నాటిక పోటీలలో ప్రథమ బహుమతి లభించింది. **1960**లో ఉస్మానియా యూనివర్సిటిలో అధ్యాపకులుగా చేరాక కూడా వరంగల్‌లోనూ, హైదరాబాద్‌లోనూ విద్యార్థి బృందాలతో నాటక ప్రదర్శన లిస్తుండేవారు శర్మగారు. ఈకాలంలోనే కాకతీయ సాంస్కృతికోత్సవాలు ప్రారంభించిన నిర్వహించారు. నాటక విమర్శ మీద చర్చలు, ప్రసంగాలు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురించే 'నాట్యకళా పత్రికలో నాటకాలకి సంబంధించిన అనేక అంశాలమీద వ్యాసాలు రచించడం ఎక్కువ కావడం ప్రారంభమయింది. అప్పుడే సంగీత నాటక అకాడమీ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికోబడడం శర్మగారి కార్యకలాపాలు కేవలం నాటకరచన, దర్శకత్వంతో ఆగక మరో మలుపు తిరిగాయి. ఈరో ల్లోనే తెలుగు నాటకం - నాటక సాహిత్యం - రచన, విమర్శ, నిర్వహణ ఇలా నాటకరంగంలో కృషిచేస్తున్న శర్మగారి దృష్టి జానపద కళారూపాల మీదకి మళ్ళింది.

''**1970**లో నేను అకాడమీ సభ్యుడిగా ఉన్నప్పుడు బెంగుళూర్‌లో దక్షిణ భారత తోలుబొమ్మల ప్రదర్శనోత్సవం జరిగింది. ఆ ఉత్సవాలలో ఇంగ్లీషులో కామెంటరీ చెప్తూ నిర్వహించే వ్యక్తి కావలసి వచ్చాడు.

అందుకు నన్ను పంపించారు. మిగతా రాష్ట్రాల నుంచి వచ్చినవారు వారి వారి ప్రదర్శనలని గురించి విశేష కృషిచేసి వారి వారి ప్రదర్శనలకు వ్యాఖ్యానం చేస్తున్నారు. అది నాకు చాలా బాధ అనిపించింది. రెండు రాత్రిళ్ళు మనవారి ప్రదర్శనని క్షుణ్ణంగా పరిశీలించి, ఆకళింపు చేసుకుని, మర్నాడు జరిగిన సదస్సులో నేను ప్రదర్శించాను. అపుడు తెలిసింది - మిగతావారికి మన బొమ్మలాట గొప్పతనం గురించి. జానపద కళారూపాలను గురించిన అవగాహన, దానికోసం క్షేత్ర పరిశీలన అవసరం అన్న విషయాన్ని అప్పుడు గుర్తించాను. ఈ పనిని ఎవ్వరూ చేపట్టలేదన్న తపన నాలో ఎక్కువైంది. ఆ ఆలోచనే నన్ను జానపద నాటక కళారూపాలని పూర్తిగా ఆకళింపు చేసుకునేటట్లు చేసింది. దాదాపు పది సంవత్సరాల పాటు ఆ నాటక రూపాలని - యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, భాగవతాలు మొదలైన వాటిని అధ్యయనం చేశాను. అప్పటినుండి ఇప్పటిదాకా నేను చేస్తున్న కృషి ఫలితమే త్వరలో తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురిస్తున్న The Folk Performring Arts of Andhra Pradesh అన్న నా పుస్తకం. ఈ పుస్తకంలో మొత్తం రాష్ట్రానికి చెందిన యాభై ఎనిమిది జానపద కళారూపాలని గురించిన విస్తృత సమాచారం ఉంటుంది''.

మన జానపద కళారూపాలను, ముఖ్యంగా తోలుబొమ్మలాటలను, భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలోను ప్రదర్శనలు ఏర్పాటు చేశారు శ్రీ శర్మగారు. అంతేకాక ఆయన అంతర్జాతీయంగా కూడా జపాన్, ఫ్రాన్స్, గ్రీస్ లాంటి దేశాల్లో కూడా ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఎంతో ఖ్యాతి సమకూర్చారు ఈ కళారూపాలకి.

ఆచార్య శర్మగారి విశ్లేషణా సామర్థ్యం ఆయన వ్రాసిన ''తెలుగు సాహిత్యం - గాంధీజీ ప్రభావం'', ''తెలుగు నవలా వికాసం'', ''నాటకకర్తగా చిలకమర్తి'' అన్న గ్రంథాలద్వారా మనకు విదితం అవుతుంది. ఈ పుస్తకాలు విద్యార్థులకు ఆధికారిక గ్రంథాలయినాయి. అందులో ''తెలుగు నవలా వికాసం'' అన్న విమర్శన గ్రంథం ఎమ్.ఏ., ఎమ్.ఫిల్. విద్యార్థులకే కాక, ఐ.ఏ.యస్., ఐ.పి.యస్. వంటి పరీక్షలకు కూడా పఠనీయ గ్రంథం అయింది. శర్మగారు తెలుగు సాహిత్య పరిశోధనే కాక ఇంగ్లీషు సాహిత్యంలో ప్రముఖ అమెరికన్ నాటక రచయిత యూజిన్ ఓనీల్ రచనల మీద పరిశోధన చేసి Ph.D. పొందారు. తెలుగు సాహిత్యం మీద పుస్తకాలు రాసినా శర్మగారి ఆసక్తి మొదటినుంచి నాటకరంగం మీదే ఉన్నదన్న సంగతి అందరికి తెలిసిందే. ఈ రంగంలో ఇంకా ఏదో తెలుసుకోవాలి, ఇంకా ఏదో సాధించాలి అనే తపనతోనే M.F.A. Degree చేయడానికి వారు **1973**లో అమెరికా వెళ్ళారు.

> ''నాటక శిక్షణ మీద నన్ను ఆకర్షించినవి రెండు సంఘటనలు. గుడివాడలో చదివే రోజులలో బసవరాజు సుబ్బారావుగారు మాకు నిర్వహించిన నటశిక్షణా తరగతులు. రెండోది కొప్పరపు సుబ్బారావు గారి రచనలు. ఆయన ప్రదర్శించిన నాటకాలు. ఆయన దేశదేశాలు తిరిగి నాటకరంగం మీద సంపాదించిన అతి విలువైన పుస్తకాలు; అంతకు మించి సుబ్బారావుగారితో పెంచుకున్న సాంగత్యం - ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడానికి దోహద పడింది. నాటకా ప్రదర్శనా లక్షణాలు ఆయన దగ్గర తెలుసుకున్న తర్వాత అంతవరకు నేను చూసిన నాటకాలన్నీ నాటక ప్రదర్శనలోని అన్ని విభాగాలకు ప్రాముఖ్యం ఇవ్వాలేదనిపించింది. ఈ విషయాలను తెలియచెప్పే సంస్థలు ఆంధ్రదేశంలో అసలు లేవు. భారతదేశంలో కూడా ఒకటో, అరో ఉన్నాయి. కనక నేను తెలుసుకోవాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయన్న

ఆలోచన రాగానే అమెరికా వెళ్ళి MFA చేసి వచ్చాను. అక్కడున్న మూడు సంవత్సరాలలోను రోజులకు 15 గంటలు పనిచేసేవాళ్ళం. నేను దర్శకత్వంలో specialize చేశాను. నా ప్రదర్శనలకి ఎంతో పేరు వచ్చింది. అక్కడ నేను నేర్చుకున్న మంచి విషయాలలో ఒకటి నాటక ప్రదర్శనలో అన్ని విభాగాలు - రచన, నటన, సాంకేతిక శిల్పం - అన్నీ సమానమైన ప్రాముఖ్య కలవి అని. రెండోది దర్శకత్వం చేసే వారు నటించడం అంత మంచిది కాదన్న మరో సూత్రం.

హైదరాబాద్ తిరిగి వచ్చాక శర్మగారు Dramatic Circle, Hyderabad అనే నాటక సంస్థకి చాలా ఇంగ్లీషు నాటకాల ప్రదర్శనలకి దర్శకత్వం చేశారు. ఇవన్నీ కూడా చాలా ప్రయోగాత్మకంగా ప్రదర్శించబడ్డవి. సంస్కృత మూలమైన మృచ్ఛకటిక, జర్మనీ నాటకమైన 'ది విజిట్', గిరీష్ కర్నాడ్ రాసిన 'తుగ్లక్, హయవదన' మొదలైన ప్రసిద్ధ నాటకాలన్నిటిని శర్మగారు ఇంగ్లీష్‌లో ప్రదర్శించారు. తుగ్లక్ నాటకం 'ఎన్విరాన్‌మెంటల్ థియేటర్'లో హైదరాబాదులో మొట్టమొదటిసారిగా ప్రదర్శించారు. ఒక కొండలో వివిధ భాగాల్ని సమతలం చేసి, ఆ వివిధ రంగస్థలాల మీద అనేక సన్నివేశాలు ఈ ప్రదర్శనలో ప్రదర్శించబడ్డాయి. అలాగే హయవదన - నాటకం అంతా ఇంగ్లీష్‌లో ఉంటే, గేయభాగం సంస్కృతం, తెలుగుల్లో ఉంటాయి. ఈ ప్రయోగాన్ని కూడా ప్రేక్షకులు హర్షించారు.

1982లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాటక విభాగం ప్రారంభించబడింది. ఆ విభాగానికి మొదట ఆచార్యులుగా శర్మగారిని నియమించారు. ఇక్కడ విద్యార్థులతో ఆయన ప్రయోగించిన నాటకాలన్నీ అద్భుతమైన ప్రయోగాత్మక ప్రదర్శనలని చెప్పక తప్పదు. ప్రాచీన గ్రీకు నాటకం 'రాజా ఈడిపస్' - ఆయన తెలుగులో అనువదించి దాదాపు 30 మంది విద్యార్థులతో ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను 2,500 సంవత్సరాలు వెనక్కి తీసుకు వెళ్ళింది. పాత్రధారుల ఆహార్యం, దుస్తులు, ఉపయోగించిన ఆయుధాలు, వస్తుసామగ్రి అన్నిటిని మించి ప్రదర్శనకి ఎన్నుకున్న Koti Women's College లోని అద్భుతమైన కట్టడం యొక్క ప్రాంగణం ఈ ప్రదర్శనని ఒక గొప్ప Spectacle గా మలిచింది. Environmental Theatreకి మరో మచ్చుతునక ''రాజా ఈడిపస్'' ప్రదర్శన.

శర్మగారి దర్శకత్వంలో ప్రదర్శించబడ్డ మరో స్వీయరచన 'నరజాతి చరిత్ర సమస్తం' (Eugene O'Neill రచించిన EMPEROR JONES ఆధారం) మరొక వినూత్న ప్రయోగంగా చెప్పుకోవచ్చు. ఇందులో నాలుగైదు జానపద కళారూపాలను మూలకథని వివరించడానికి, జరుగుతున్న సంఘటనలని వ్యాఖ్యానించడానికి, వాడుకున్నారు దర్శకులు శ్రీ శర్మగారు. సమకాలీన ఇతివృత్తం గల నాటకం ప్రయోగించడానికి ఇలా సంప్రదాయ కళారూపాలను వాడుకోవలసిన అవసరం ఉందా? నాటక ఇతివృత్తంలో ఇమడకుండా ఇలాటి కళారూపాలను కేవలం Narration కోసం వాడుకుంటే అతికించినట్లు ఉండదా? ఇదే ప్రశ్న ఆయన్నడిగితే ఇలా చెప్పారు - ''ఇలా సంప్రదాయ కళారూపాల్ని సమకాలీన ఇతివృత్తం గల నాటక ప్రయోగంలో వాడటం అవసరమా లేదా అన్నది కథావస్తువుని బట్టి వస్తుంది. నరజాతి .... నాటకానికి మూలమయిన అమెరికన్ నాటక రచనలో ఇటువంటి ప్రక్రియ లేదు. కాని నా ప్రేక్షకులకి ఇందులోని ముఖ్యపాత్ర దిగజారిపోయే పరిస్థితులను బాగా హత్తుకుపోయేలా వివరించడానికి నేనే ఏదో ఒక ప్రత్యేక పద్ధతి అనుసరించాలి. ఆ నాటకంలోని పాత్రలన్నీ గిరిజన

పాత్రలు. వారి భాష, ఆచారాలు అన్నీ వైవిధ్యంగా ఉంటాయి. కనుకనే జానపద కళారూపాలయిన వీర విద్యావంతులు, ఒగ్గుకథకులు, శారదా కథకులు - వీరి బాణీని నాటకంలో ప్రవేశపెట్టాను. అది కథావస్తువుకి దగ్గరగా ఉంటుంది. ఉండాలి కూడా! పైగా ఆ formని గురించి తెలియని urban ప్రేక్షకులకి కూడా, అందులో పైకి దృశ్యంగా ఉండే గిరిజన కట్టు, బొట్టు, ఒక డాలు - ఒక కత్తి, పాట, నృత్యం మొదలయినవి వారిని ఆకట్టుకునేటట్లు చేస్తాయి. అంతేకాక అంతర్గత లక్షణాలయిన కథని వివరిస్తూ ముందుకి తీసుకెళ్ళడం జరిగిన కథను విశ్లేషించడం మొదలయినవన్నీ చూచి ప్రేక్షకులు ఆనందించ గలరు. అందువల్లనే జానపద కళారూపాలు ఆ నాటకంలో ఒక భాగమయ్యాయి. అలాగే 'కాగితం పులి' అనే నా ప్రదర్శనలో కీర్తనలని ప్రవేశపెట్టాను. ఇందులో కీర్తనకారుడి పాటలు నాటకగమనంలో, రంగానికి రంగానికి, మూడ్‌కి మూడ్‌కి, transformation తీసుకొస్తాయ్. అంతేకాక ఆ గ్రామంలోని ప్రజలందరిలోనూ ఒక చైతన్యం తీసుకొస్తాయ్. ఇక్కడ కీర్తనలని ఒక specific purpose కోసం వాడుకోవడం జరిగింది. ఇలాటి ప్రయోగాలు చేద్దామనుకున్నప్పుడు ముందు ఆ నాటకం content ఇటువంటి formsని ఉపయోగించడానికి అనువైనదా కాదా అనేది నిర్ణయించుకోవాలి. 'ముద్రారాక్షసం' నాటకాన్ని వీధినాటక ఫక్కీలో చెయ్యాలని అంతా సిద్ధం చేసుకున్నాను. తర్వాలో చేస్తాను.''

ఇతర భాషలలోని గొప్ప నాటకాలని తెలుగు నాటకరంగానికి పరిచయం చేసి పుణ్యం కట్టుకున్నవారిలో శర్మగారు ప్రథములు. ప్రఖ్యాత మరాఠీ నాటక రచయిత విజయ్ టెండూల్కర్ నాటకం ''నిశ్శబ్దం! కోర్టు నడుస్తున్నది'' ఈయన తెలుగులో ప్రయోగించారు. నాటకం రిహార్సల్సులో నుంచి నిజ జీవితంలో జరిగిన నాటకం క్రమక్రమంగా ఉన్మీలనం అవుతుంది. చాలా చక్కని సన్నివేశాలతో ప్రేక్షకులని విపరీతంగా ఆకట్టుకుంది ప్రదర్శన. ఇబ్సన్ మహాకవి రచన Enemy of the people ఆధారంగా రాసి దర్శకత్వం వహించి ప్రదర్శించిన 'ప్రజల మనిషి' నాటకం మరో మంచి ప్రదర్శన. బాహ్యసౌందర్యం - అంతర్గతంగా ఉండే ఆధ్యాత్మకమయిన అందం - ఏది అసలయిన అందం అని తర్కించే మరో రచన 'మన్మధుడు మళ్ళీ పుట్టాడు'. ఒక రకమయిన ఫాంటసీ. అలాగే డాల్స్‌హౌస్, మాక్‌బెత్, వెయింటింగ్ ఫర్ గోడో'' వంటి ప్రఖ్యాతమయిన పాశ్చాత్య నాటకాలను కూడా అనువదించారు శ్రీ శర్మగారు.

నటుడిగా రంగస్థల ప్రవేశం చేసి, నాటక రచయితగా వివిధ రీతులలో నాటకాలు రచించి, ప్రయోగాత్మక దర్శకుడిగా పేరు గడించిన శర్మగారు తెలుగు నాటకం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి ఏం చేశారు? తోలుబొమ్మల ప్రదర్శనలని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేశారు గదా. మరి సాంఘిక నాటకాన్నెందుకు ప్రమోట్ చెయ్యలేదు'' అని అడిగితే, నేను ప్రమోట్ చెయ్యలేదు. ఫోక్ ఆర్ట్స్ ఉత్సవాలు నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నా సహాయాన్ని అడిగితే నేను నాకు చేతనయింది చేశాను. అలా సాంఘిక నాటకాలనెవరూ అడగటం లేదు. ఇతరులచేత ఆహ్వానించబడే స్థాయిలో మన నాటకాలు లేవు. అందుకు కారణాలమేమిటో నీకు బాగా తెలుసు'' అన్నారు. ''ఇవ్వాళ్టి భారతీయ నాటకరంగం కేవలం వాస్తవిక నాటకాలను దాటి చాలా ముందుకు వెళ్లింది. మనం ఇంకా బాక్స్‌సెట్ నాటకాల్లోనే వున్నాం.'' అంటారు శర్మగారు.

తెలుగు నాటకం ప్రొఫెషనల్ స్థాయిలో రావాలంటే Repertory అనేది చాలా ముఖ్యం. అది స్థాపించాల్సింది ప్రభుత్వమే. ప్రభుత్వానికి ఈ విషయంలో నచ్చచెప్పే lobbying కాని, వేదిక కాని మనకి లేదు. Repertory లేనంత కాలం మనం ఇంతేనంటారు ఆయన. ''రిప్పర్టరీ ప్రయోగరంగస్థలానికి, వృత్తిరంగస్థలానికి మధ్యేమార్గం. ముందు రిప్పర్టరీ వస్తే అందులో నటీనటులు వృత్తి నాటక స్థాపనకి దోహదం చేస్తారు.'' అని శర్మగారి దృఢమైన అభిప్రాయం. ఆయన కలలు ఫలించి Repertory వస్తుందా? తెలుగు నాటకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందా!! చూద్దాం మరి!!!

ఆయన నిరంతర పరిశోధకుడు. నూతనత్వం కోసం వెదుకులాడే మేధావి. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాలనుకునే ధైర్యశాలి. అన్నిటికి మించి ప్రచారం కావాలనుకునే మనస్తత్వం ఆయనకు లేదు. ఆయనకెందుకుండాలి? ఆయన కోరకుండానే ఆయనకు ప్రచారం తేగల ఆయన విద్యార్థులు అనేకమంది ఆయనతో ఉన్నారు. నటుడిగా, దర్శకుడిగా, రచయితగా, అధ్యాపకుడిగా, గ్రంథకర్తగా, వక్తగా, వ్యాసకర్తగా, విద్యార్థులకి పెద్దదిక్కుగా, సాంస్కృతిక రాయబారిగా, వీటన్నిటికి మించి మానవతావాదిగా జీవితంలో అరవై వసంతాలు పూర్తి చేసుకున్న మాష్టారు Retire కావడమేమిటి? Nonsense! ఆయనే రిటైర్ అయితే, ఆయన చేపట్టిన ప్రాజెక్టులు, ఆయన్నే నమ్ముకున్న పరిశోధక విద్యార్థులు, ఆయన దగ్గర్నుంచి ఇంకా ఎంతో ఆశిస్తున్న నాట్యమిత్రులు - వీళ్ళంతా ఏమయిపోవాలి? ఆయన చేపట్టిన నాటక విమర్శనా గ్రంథాలు ఏం కావాలి? అందుకే మాష్టారుకి రిటైర్‌మెంట్ లేదు. ఉండదు.

ఇలానే ఆయన పదికాలాలపాటు మనందరి మధ్య ఉండి, తెలుగు నాటక సరస్వతికి సేవ చేస్తూ, మనకు మార్గదర్శకత్వం నెరుపుతారని ఆశిద్దాం.

– డి.యస్.యన్. మూర్తి.